# నైజం



కాకినాడ టౌన్.... సమయం రాత్రి ఎనిమిది గంటలు!

నా ఫ్రెండ్ సతీష్, నేనూ కలసి కాకినాడ సెకండ్ బస్టాప్‌కు కొద్దిదూరంలో కూర్చుని ఉన్నాం. అప్పటికి అర్ధగంటనుంచీ బస్ రాకకై ఎదురుచూస్తూ కబుర్లలో మునిగిపోయాం. ఇంతలో దూరాన "కట్టంగ" అనే బోర్డున్న బస్ రావడాన్ని గమనించి స్టేజ్‌వైపు పరుగుదీసాం. అది ఈమధ్యనే మా ఊరిమీదుగా క్రొత్తగా రూట్ చేయబడిన బస్. ఆ బస్ డ్రైవర్‌కు జనాన్ని పరుగెట్టించడం సరదా అనుకుంటా! బస్‌ను స్టేజ్‌కు పర్లాంగు దూరం తీసుకెళ్ళి ఆపాడు. జనంతోబాటు మేంకూడ ఆటు అడుగు వేయబోయి ఆఖరి నిముషంలో ఆగిపోయాం. కారణం - మా ఊరి అమ్మాయైన "సుజాత" చేతిన సూట్‌కేస్‌తో నిల్చొనివుంది. అయితే అదికాదు మమ్మల్ని ఆకర్షించిన విషయం. ఆమెలో బస్‌ను గమనించిన కంగారు ఇసుమంతకూడ కానరావడంలేదు. బహుశా ఆ బస్ రూట్ తెలియకనేమో అనుకుంటా ఆమెవైపు అడుగులేసాం.

"మీరు ద్రాక్షారామమేనా?" ప్రశ్నించాను ఆమెనుద్దేశించి.

ఆమె అవునన్నట్లు తలూపింది. మాట్లాడితే నోటి ముత్యాలేమైనా రాలిపోతాయనుకుంటున్నదేమో అనుకుంటూ రెండో ప్రశ్న కూడా వేసాను.

"ఆ బస్ ద్రాక్షారామ వెళుతుంది తెలుసా?"

"అయితే ఏమిటట?" అన్న ఆమె తలబిరుసు సమాధానంతో నా అహం దెబ్బతింది. అసలు నేనైనా అంతచొరవను ప్రదర్శించి ఉండకపోదును. నా జూనియర్ల ద్వారా ఆమె విశాల హృదయం గూర్చి, ఆదర్శాల గూర్చి విన్న నేను ఆమెపై ఏర్పడిన ఒకలాంటి గౌరవభావంతో మాత్రమే వెళ్ళాను. కానీ ఆమెఇచ్చిన రెస్పాన్స్ ద్వారా ఆమెనుగూర్చి అధికంగా అంచనా వేసుకున్న నాలో ఈ చిన్నిసంఘటనఇంతటి సంచలనాన్ని రేపి నా ఆలోచనల్లో ఆమె వ్యక్తిత్వం కుదించుకుపోయినట్లు ఆమె ఏ కొంచెం గ్రహించ గలిగినా....?

* * *

ఇది జరిగిన రెండోరోజున ఏదో పనిపడి "సుజాత" ఇంటివైపు వెళుతున్ననన్ను సుజాత పిలిచి సరాసరి డ్రాయింగ్ రూంకు తీసుకెళ్ళింది. ఈ అసహజ సంఘటనకు మనసు కంట్రోల్ తప్పి ఎటో వెళ్ళిపోయింది.

టీనా, కాఫీనా? ఏమి తీసుకుంటారు? అన్న ఆమె ప్రశ్నకు తడబడుతూ "కాఫీ" సమాధానమిచ్చాను. అయిదు నిముషాల తరువాత ..

ఈ అసందర్భపు మర్యాదలకుకారణమేమిటో అనుకుంటుండగానే ఆమె గమనించినట్లూ చెప్పడం మొదలుపెట్టింది.

"మిమ్మల్ని ఆహ్వానించడానికి కారణం ఆనాటి నా ప్రవర్తనకు సారీ చెప్పుకుందామని ఆరోజు నా ప్రక్కనే నిలుచున్న ఆమెను మీరు గమనించారు లేదో....ఆమే అందుకు కారణం. ఆమె ఓ సాధారణ సగటుఇల్లాలు. అంటే ఆమె దృష్టిలో ఒకఆడ మగ మాట్లాడుకోవడంమధ్య బంధం ఆలుమగలగానీ అన్నాచెల్లెల బంధంగానీ అయిఉండాలేతప్ప మరేరకంగానూ ఐహిక స్నేహబంధంకూడా ఉండరాదు. ఏమైనారియల్లీ ఆయామ్ వేరీ సారీటూయు" అంటూ ముగించింది.

అది కలో నిజమో అర్థంగాక అప్పటివరకు

ఆమెపై అనవసరపు అపార్థాలతో అభాండాలు వేసుకున్నందుకు మనసు లోతుల్లో సన్నని ప్రకంపనపుట్టి ఆమె ఒక్కసారిగా నాకు అందనంత ఎత్తుకు ఎదిగిపోతున్నట్లు ఫీలవుతున్న నానుంచి ఏటువంటి రెస్పాన్సు లేకపోవడం సహజమే అన్నట్లు ఆమె వాతావరణను తేలికపరచడానికి అన్నట్లు ఏదేదో మాట్లాడేయసాగింది. కానీ ఆమె సంజాయిషీవల్ల ముప్పిరిగొన్న ఆనందపుహోరులో అవేమీ నాతలకెక్కడంలేదు

అలా అక్కడ ఎంతటైమ్ గడిపానో గుర్తులేదుకానీ ఆమెఅన్న చివరి వాక్యంమాత్రం మైండ్‌లో రికార్డయిపోయింది. అది.... "ఫోన్లేండి. ఆమె ద్వారానైనా మనమధ్య స్నేహం అంకురించింది. అప్పుడప్పుడూ కలుస్తుండండి"

మొదట్లో మర్యాదకోసం వెళుతూ అలా వెళ్ళడం అలవాటై మామధ్య స్నేహం అభివృద్ధి చెందడం జరిగింది.

ఇలావుండగా ఓరోజు విషయం తెలిసిన స్నేహితుడొకడు నాకు ఉచితసలహా పారేయడం ద్వారా హితబోధ చేసాడు. నాకూ ఆలోచించేకొలదీ ఎందుకో ఆ అయిడియా బాగానే ఉన్నట్లుగా తోచింది. అంతే! అయిడియా ఆ మరునాడే ఆచరణలో పెట్టాలనుకోవడం వెంటనే జరిగిపోయాయి.

ఆ మరునాడు....

"సుజాత" ఆ ముందురోజు నన్ను అడిగిన గైడ్ సంపాదించి ఇంటికి తీసుకెళ్ళాను. ఏదో నోట్సు ప్రిపేర్ చేసుకుంటున్న సుజాత నన్ను చూడగానే చిర్నవ్వు చిందించింది. నా చేతిలోని గైడు ఆమెకందిస్తూ "కొంచెం అర్జంటుపని పడింది. సాయంత్రం కలుస్తాను" అంటూ బయలుదేరబోతుంటే 'తప్పకుండా రండి. మీతో ఓ విషయం చెప్పాలి" అంది.

ఆమె సమాధానంకు ఆమెకూడా నా కోణంలోనే ఆలోచిస్తున్నదేమో అన్న ఆలోచనకలుగగానే ఆనందం పట్టలేకపోయాను. ఆ ఆనందంలో ఫ్రెండ్స్‌తో సరదాగా కాలక్షేపంచేస్తూ సాయంత్రంవరకూ గడిపాను.

ఆ సాయంత్రం... సరిగ్గా అయిదుగంటలు వాతావరణం పిచ్చుకల శబ్దాలతో వినసొంపుగా, అందంగా ఉంది.

సుజాత ఇంటిలోనికి అడుగిడుతున్న నా గుండె చేస్తున్న "లబ్‌డబ్" శబ్దం నాకు చాల స్పష్టంగా వినిపిస్తుంటే లోనికెళ్ళాను.

ఆమె నాకోసమే ఎదురుచూస్తున్నట్లూ ఒంటరిగా కూర్చుని ఉంది. నన్ను చూడగానే ఆమె ముఖంలో ఏదో అస్పష్టమైన భావం కదలాడటం గమనించాను. దగ్గరికెళ్ళిన నా చేతిలో ఓ కవరుంచి ఇంటికెళ్ళాక చదూకోమంది. ఇంట్లో ఏదోపని ఉందనీ మాట్లాడటానికి కుదరదనీచెప్పడంతో కవరు పట్టుకుని గాలిలో ఆనందంతో తేలియాడుతూ పార్కుకువెళ్ళి ఓ మూల ఖాళీగానున్న బెంచిపై కూర్చుని కవర్ ఓపెన్‌చేసాను. దానిలో ఏదో కార్డులావుంటే బయటకు తీసి చూసాను. అది....శుభలేఖ. దానిలో "రాంమోహన్ వెడ్స్ సుజాత" అనివుంది. దానినిచదవగానే ఎవరో నా చెంపను ఛెళ్‌మనిపించినట్లు ఫీలయ్యాను. ఆపై వణుకుతున్న చేతులతో కవర్ నున్నలెటర్ తీసి చదవసాగాను.

"వాసుగారూ...."

మీరుచేసిన పనికి మిమ్మల్ని "డియర్" అని కూడా సంబోధించడానికి నా పెన్ ఒప్పుకోవడం లేదు నా ఫ్రెండ్స్‌ద్వారా మీ అభిప్రాయాలను గూర్చివిన్న నేను మీ వ్యక్తిత్వాన్ని గొప్పగా ఊహించుకోవడంలో తప్పులేదనుకుంటా కానీ గైడ్‌లోవుంచిన మీ లవ్‌లెటర్‌ను చూడగానే ఆనాటి నా ప్రవర్తనకు, నేనుచెందిన ఆవేదనకు అర్థంలేదని తెలిసింది. మిమ్మల్ని, మీ ఆలోచనలను చాలా ఎక్కువగా అంచనావేసాను. కానీ అంతచదువూ చదివి మీరూ ఓ మగవాడిగానే ఆలోచించినందుకు-ఓ నిజాయితీనిండిన స్నేహితునిగానే భావించిన మిమ్మల్ని ఏమనాలో అర్థం కావడంలేదు. ఇంత స్నేహమూచేసి చివరకు మీరుకూడా ఆడ మగ మధ్య స్నేహం అనేది ఉండదు. కామంమినహా అని తేల్చగలిగారూ అంటే మొట్టమొదటిసారిగా నాపై నమ్మకం సన్నగిల్లుతున్నది. నా వ్యక్తిత్వంపై నాకే అనుమానం కలుగుతున్నది మీకుఅసలు అటువంటి అపసవ్యపు ఆలోచన వచ్చిందిఅంటే ఎక్కడో నా ప్రవర్తనలో లోపంవున్నట్లే: బహుశా ఆ లోపం నేను ఆడదానిని కావడమే కావచ్చు.

కానీ వాసుగారూ....ఓ విషయం గుర్తించుకోండి....

"స్త్రీ పురుషులిద్దరూ ఆకృతిలో మినహా ప్రకృతిలో అన్నిరకాలుగానూ సమానమే" అన్న దృష్టితో పెరిగిన దానినినేను. కానీ ఈ సంఘటన ఓ విధంగా నన్ను ఆలోచనకు గురిచేసింది. ఏమైనా మీరు నా కళ్ళు తెరిపించారు. థాంక్యూ వెరీమచ్.

కృతజ్ఞతలతో....

సుజాత,

చదవడం ముగించాను. మనసు మూగపోయింది. మనసులో మొదలైన ఘర్షణ అనంతమైన కన్నీటిరూపంలో ఆవేదనను గెంటుతూ ఉంటే చేతిలోని పేపర్‌పైగల అక్షరాలు కన్నీటితో తడుస్తున్నాయి! •

– శాకా శ్రీనివాస్ బి. కాం.

